క్లుప్తంగా

పోలీసుల ముమ్మర తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: మండలంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లకు ప్రభుత్వం రాయితీ ప్రకటించడంతో వాహనాలపై ఉన్న చలాన్లను వసూలు చేస్తున్నారు. గురువారం మండలంలోని పోచమ్మగడ్డ తండా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న చలాన్లను అక్కడికక్కడే కట్టిస్తున్నారు. అయితే, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ రమేష్ సూచించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న మల్లారెడ్డి

మోమిన్‌పేట: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళల కృషి చేస్తానన్నారు. మన సమస్యలను జిల్లా, రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల నేత దృష్టికి తీసుకుపోతానని ఆయన పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మల్లయ్య, జిల్లా కోశాధికారి జూకరెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ


స్వామివారిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, స్వాములు

కొడంగల్ రూరల్: మున్సిపల్ కేంద్రంలోని వడ్డెర్‌గల్లీ చితార్ పెరుమాళ్ల దేవస్థానం ఆవరణలో గురువారం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా గురుస్వాములు పడి పూజ ను నిర్వహించారు. అయ్యప్పస్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అలాగే, గణపతి పూజ, అభిషేకం, పుష్పాలంకరణ నిర్వహించారు. గురుస్వాములు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని, భక్తి కలిగిన వ్యక్తికి సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. గురుస్వాములు స్వామివారిని ధ్యానిస్తూ పాడిన పాటలు అలరించాయి. అనంతరం అయ్యప్ప స్వాములకు లక్ష్మీనారాయణ భిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కోస్గి, కొడంగల్, రావులపల్లి, కుదురుమళ్ల, బొంరాస్‌పేటలతో పాటు పరిసర గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు పడిపూజలో పాల్గొన్నారు.

చేవెళ్ల నుంచి తిరుపతికి పాదయాత్ర

చేవెళ్ల: చేవెళ్ల నుంచి తిరుమలతిరుపతి వరకు పాదయాత్రగా పలువురు భక్తులు బయలుదేరి వెళ్లారు. గురువారం చేవెళ్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద పూజలు చేసుకొని పాదయాత్ర ప్రారంభించారు. చేవెళ్ల మండలానికి చెందిన పలువురు భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు ఈ యాత్ర ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం వారికి అయ్యప్పస్వాములు సంఘీభావం తెలిపారు. పాదయాత్రను విజయవంతంగా ముగించుకోవాలని కోరారు.

దాతల సహకారం మరువలేనిది

మొండివాగు పాఠశాల హెచ్‌ఎం సరిత

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని మొండివాగు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత అన్నారు. చేవెళ్ల మండలంలోని మొండివాగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రోటరీక్లబ్ ఆఫ్ చందనగర్ పాఠశాలకు పెయింటింగ్ వర్క్స్ చేయించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో రోటరీక్లబ్ సభ్యులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగాస్వామ్యం కావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి రంజిత్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు సుభాష్, సభ్యులు భారతి, చేవెళ్లస్వామి, ఎన్కేపల్లి పాఠశాల హెచ్‌ఎం మునీర్‌పాషా, పాఠశాల ఉపాధ్యాయులు డి.క్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బారులుదీరారు..

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన మొదలైంది. గురువారం అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఐదు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులను ప్రజలకు అందజేస్తున్నారు. మొదటి రోజు ప్రజలు బారులుదీరారు. ఉచితంగా అందజేస్తున్న దరఖాస్తులు సరిపోకపోవడంతో, దరఖాస్తుల ఫారాల కోసం జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజాప్రతినిధులు భరోసా కల్పించారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో అన్ని సెంటర్లను పరిశీలిస్తూ ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

–సాక్షి, నెట్‌వర్క్


అనంతగిరి: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


బొంరాస్‌పేట: ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


మర్పల్లి: సీఎం సందేశం వినిపిస్తున్న తహసీల్దార్ గణేశ్



పెద్దేముల్: సీఎం సందేశం వినిపిస్తున్న అధికారులు


నవాబుపేట: అక్నాపూర్‌లో మాట్లాడుతున్న కాలె యాదయ్య


దౌల్తాబాద్: ఎల్‌జీ తండాలో..


వికారాబాద్ అర్బన్: దరఖాస్తులను స్వీకరిస్తున్న చైర్‌పర్సన్


కొడంగల్ రూరల్ : పోశమ్మతండాలో..



పరిగి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మోమిన్‌పేట: దరఖాస్తు స్వీకరిస్తున్న విజయ్‌కుమార్


తాండూరు టౌన్ : దరఖాస్తు స్వీకరిస్తున్న మనోహర్ రెడ్డి


కొడంగల్ : దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న గురునాథ్‌రెడ్డి


బషీరాబాద్: దరఖాస్తు స్వీకరిస్తున్న కరుణ, శ్రీనివాస్‌రెడ్డి


ధారూరు: వృద్ధుడికి రసీదు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి


కుల్కచర్ల: దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు


మర్పల్లి: ఎంపీడీఓకు దరఖాస్తు అందజేస్తున్న లబ్ధిదారు


తాండూరు టౌన్ : 2వ వార్డులో..


బంట్వారం: మాలసోమారంలో..


బొంరాస్‌పేట: దరఖాస్తుల స్వీకరణలో మహిళల సందడి

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

మర్పల్లి ఎంపీపీ బట్టు లలిత రమేష్

మర్పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేదలకు అందేలా చూడాలని మర్పల్లి ఎంపీపీ బట్టు లలిత అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీపీ లలిత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల కోసం అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అర్హులైన పేదల నుంచి సంక్షేమ పథకాల దరఖాస్తులు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖపై చర్చ భాగంగా గతంలో రైతు బంధు పథకం కింద ప్రభుత్వం నుంచి పంట పెట్టుబడుల కోసం డబ్బులు తీసుకున్న రైతులు అభయ హస్తం ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకోవద్దన్నారు. కౌలు రైతులు, ఉపాధి జాబ్‌కార్డు కలిగిన రైతులు ప్రభుత్వం ఇచ్చే రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెవెన్యూశాఖపై తహసీల్దార్ గణేష్ ఎజెండా అంశాలు చదువుతుండగా జెడ్పీటీసీ మధుకర్ కలుగచేసుకొని మండలంలో గత ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించిన 1 లక్ష 116 ఆర్థిక సహాయం చెక్కులు లబ్ధిదారులకు మంజూరయినా ఇంత వరకు ఇవ్వడం లేదని ఆరోపించారు. చెక్కులపై గత ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియనుందని చెక్కులు ఇచ్చేలా చూడాలని తహసీల్దార్ గణేష్‌కు సూచించారు. దీంతో తహశీల్దార్ గణేశ్ మాట్లాడుతూ..మండలానికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు 45కు పైగానే వచ్చాయని ఈ విషయం వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వివరించామని త్వరలో చెక్కులు అందజేయనుందన్నారు. మండలంలో ప్రతిదినం క్లస్టర్ -1, క్లస్టర్-2లో ఉదయం, మధ్యాహ్నం రెండు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ప్రజాప్రతినిధులు సహకరించి పథకాల కోసం దరఖాస్తులు పెట్టేలా చూడాలన్నారు. అంతకుముందు ఆయా శాఖల అధికారులు తమ ఎజెండా అంశాలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్‌ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సోయేల్ శరీఫ్, సూపరింటెండెంట్ కృష్ణారావు ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ గణేశ్

మున్సిపల్ కమిషనర్‌పై మహిళల ఆగ్రహం


ఎమ్మెల్యే ఎదుట కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన మహిళలు

తాండూరు టౌన్: కనీస మర్యాద ఇవ్వకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని తాండూరు మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లాపై పట్టణంలోని ఓ స్వయం సహాయక సంఘం మహిళలు విరుచుకుపడ్డారు. గురువారం పట్టణంలోని 2వ వార్డులో ప్రజా పాలన ప్రారంభించేందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎదుట కమిషనర్‌పై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని వినాయక స్వయం సహాయక సంఘానికి వచ్చిన రుణంలో ముగ్గురు మహిళలు రుణం తీసుకోకపోవడంతో డబ్బులను బ్యాంకులో జమ చేశారు. మూడు నెలల తర్వాత సంఘానికి చెందిన ఓ మహిళ తనకు రుణం కావాలని ఇతర సభ్యులతో గొడవకు దిగింది. ఈ విషయంలో కమిషనర్ మిగతా సభ్యులను పిలిచి అమర్యాదగా మాట్లాడుతూ.. ఆమెకు రుణం ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నాడని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మహిళలు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన

కుల్కచర్ల: స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి నేటి వరకు పేద ప్రజల పక్షాన నిలుస్తూ వచ్చిన పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భాం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల తరఫున పోరాటం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. 139 సంవత్సరాలు గడిచినా ప్రజలు విశ్వసించడంలోనే కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న నమ్మకానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, కుల్కచర్ల ఎంపీటీసీ ఆనందం, కాంగ్రెస్ పార్టీ బ్లాక్2 అధ్యక్షుడు భరత్ కుమార్, నాయకులు బాల ముకుందం, క్రిష్ణారెడ్డి, పాల్గొన్నారు.

నవాబుపేటలో..

నవాబుపేట: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీబ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, బందయ్య, నాగభూషనం, పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన కాంగ్రెస్ పార్టీ

తాండూరు టౌన్: పేదల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కాంగ్రెస్ భవన్‌లో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో క్రియాశీలక పాత్ర వహించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంస్కరణలను తీసుకువచ్చి, వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ఎమ్మెల్యేగా నన్ను గెలిపించిన కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్, సర్దార్‌ఖాన్, డాక్టర్ సంపత్‌కుమార్, సునీతాసంపత్, లింగదల్లి రవి, ప్రభాకర్ గౌడ్, హబీబ్‌లాలా, మాధవి పాల్గొన్నారు.


తాండూరు టౌన్: పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

గొప్ప చరిత్ర గల పార్టీ

పరిగి: కాంగ్రెస్ పార్టీకి ఉన్న చరిత్ర దేశంలో మరే పార్టీకీ లేదని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని టీఆర్‌ఆర్ నివాసంలో పార్టీ జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1885లో పార్టీ ఆవిర్భవించి దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో పోరాటం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా పార్టీ పని చేస్తుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తరువాత సుదీర్ఘకాలం పాటు పార్టీ దేశాన్ని పాలించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశంలో ఎన్నో సంస్కరణలు వచ్చాయన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీగా కాంగ్రెస్ చిరకాలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందన్నారు. దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటుకు అండగా ఉన్న ప్రజలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎర్రవల్లి జాఫర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనే లక్ష్యం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం బెన్నూరు గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పక అమలు చేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుల విషయంలో ప్రజలకు ఎలాంటి అపోహలు కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, సొసైటీ చైర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి, సర్పంచ్ పటేల్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మప్ప, తహసీల్దార్ మునీరోద్దీన్ తదితరులు ఉన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే